# నాకు నచ్చిన నా కథ



వి. వి. వి. రామారావు

కాకిపిల్ల కాకికి ముద్దేకావచ్చు కాని అచ్చయిన తన ప్రతి కథా అద్భుతమైనదని ఏ రచయితా అనుకోడనే నా నమ్మకం. కలంపట్టిన ప్రతి రచయితా వైవిధ్యం గల కథలనే రాయాలనుకుంటాడు. పాఠకుల ఆదరణకోసం ఫలానా కోవలో ఉన్న కథలే కావాలని నిర్దిష్టంగా సంపాదకులు ఉదహరిస్తున్న రోజుల్లో ఈ శీర్షికలో ప్రచురించడానికి నాకు నచ్చిన కథ 'వాసనలేని పువ్వు'.

సాధారణ పాఠకుడు సామాన్య మానవునిలాగే మనకి తారసపడని వ్యక్తి. నిర్వచనానికి అతీతుడు. కథ ఎందుకు చదువుతారు అన్న ఆలోచనతోపాటు కథ ఎందుకు చెబుతున్నాను అన్న ఆలోచన ఉండడమూ అవసరమే. దీనినే 'పాయింట్ ఆఫ్ ది స్టోరీ' అంటారు.

విదేశీ వ్యామోహం దురదృష్టకరమన్న సందేశాన్ని అందించడం కోసమే ఈ కథ రాశాననిపిస్తుంది. ఇది నాకు నచ్చడానికి కారణం ఇందులోని యువ పాత్రలు, వారి మనస్తత్వాలు, వాటిని ప్రభావితం చేసిన వాతావరణం. ఇందులోని శిల్పం అల్పమో - అనల్పమో వేలాది కథలు (ఎందుకోసం చదివినా సరే) చదివిన సాధారణ పాఠకులే నిర్ణయించగలరు.

ఈ కథ ఆంధ్రప్రభ వారపత్రిక ది 21-1-81 సంచికలో ప్రచురితమైంది.

# వాసనలేని పువ్వు

మెరుపు తీగకు మానవాకృతి వచ్చినట్టుంది గౌరి. కన్నెచెర విడి కొత్త వెలుగులో మెరిసిపోతూంది.

మనోహరి కళ్ళు ఆమె వంక మైమరచి చూస్తున్నట్టు గౌరికి తెలియదు కానీ, ఏదోలా చూస్తూందని మాత్రం తెలిసి శోభన కాంతుల నీనే తన కళ్ళను మరల్చుకొని అందంగా సిగ్గుపడింది

గౌరి ముఖాన పసుపు వన్నెకే కొత్త అందం సిద్ధించింది. అమరానందం చవిచూసిన అనుభూతివల్ల కాటోలు, కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి కెంపు లంటే ఏమిటో సరసుడైన కళాకారుడు చిత్రించి చూపినట్టున్నాయి గౌరి బుగ్గలు చెక్కిళ్ళను అద్దాలతో ఎందుకు పోలుస్తారో మనోహరికి మొదటిసారిగా తెలిసి వచ్చింది అలా రెప్ప వాల్చకుండా చూస్తూంది.

'నేను ఇప్పుడు నిండైన ఇల్లాలుగా ఎదిగిన ఇంతిని సుమా!' అని హెచ్చరిస్తున్నట్టు నిండైన కుంకుమ బొట్టు, సిగలో పసిమి నా సొంతమన్నట్టున్న చామంతులు, చెవులకు జూకాలు, కాళ్ళకు పట్టీలు, వేళ్ళకు మట్టెలు.

"ఏమిటమ్మా! అలా సూస్తన్నారు!" ఆ చూపులకు తట్టుకోలేక పోయింది గౌరి

"ఎలా ఉంది, గౌరీ, తేనె వెన్నెల?" మంజు అడిగింది ముసిముసి నవ్వు నవ్వుతూ

"ఏటండీ, సిన్నమ్మగోరు!" మంజు మాట తెలియక మనోహరిని అడిగింది, కళ్ళు వింతగా తిప్పుతూ.

'అదేనే— నువ్వు పెళ్ళిచేసుకుని మీ యజమానితో సింహాచలం వెళ్ళి తిరిగి వచ్చావుగా? జంట కొత్త రోజుల్లో అలాఅలా తిరిగిరావడాన్ని ఇంగ్లీషులో 'హనీమూన్' అంటారు. దాన్నే తెలుగులో 'తేనె వెన్నెల' అంది చెల్లాయ్!"

"అమ్మాయిగోరి కన్నీ పరాసెకాలే! మా కేలమ్మా తేనెలూ, ఎన్నెల్లూ!"

మనోహరి నిజమే ననుకుంది. గుండెలో ఆ స్పందన ఉంటే అంతా తేనే, అంతా వెన్నెలే కదూ?

గౌరి కళ్ళలోని వెలుగూ, ఆనందమూ— వాటి విలువ అంకెల్లో ఊహిం చడం అసాధ్య మనిపించింది మంజుకు కూడా. నిట్టూరుస్తూ అంది అక్కతో: "డబ్బున్న పుట్టుక పుట్టకూడదక్కా. వాళ్ళు చూడు ఎంత హాయిగా ఉన్నారో! శారీరిక శ్రమపడ్డా మానసికమైన శాంతి, తృప్తి వీళ్ళకు ఉన్నాయి. దీని పెళ్ళి చూడు— ఎంత సులువుగా అయిపోయిందో! అదే మనకు కావాలంటే సంవత్సరాల తరబడి గాలింపు! కాదు, వేట. గౌరీ! మీ ఆయన ఇంగ్లీషు సిని మాలు చూస్తాడే?"

పరాకుగా చూస్తూంది మంజువైపు మనోహరి. అక్క మొహం చూసి మెల్లగా అక్కడనుంచి మంజు జారుకుంది.

"పెళ్ళివారు వస్తూంటే అదేమిటే అలా కూర్చున్నావు? లే. తొందరగా ముస్తాబవు!"

"ఏం. ముస్తాబు చేస్తేకానీ చెల్లెలు కానని భయమా?" మనోహరికి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

"ఏం చదువులో, ఏం చోద్యమో? లేత మనసుల్లో నిరాశ నింపుతున్నాయి. పోనీలే, కనీసం చీరయినా మార్చుకుంటావా? నిన్ను తయారుచేయడానికి పిన్ని తయారవుతూంది."

"నే చేస్తానక్కా. నువ్వెళ్ళు."

మనోహరి తల్లి నిట్టూరుస్తూ వంటగది అజమాయిషీకి వెళ్ళిపోయింది.

మనోహరి తల్లి కామేశ్వర్రావుగారితో పోరి పోరి ఈ సంబంధం మాట్లాడమని చెప్పింది. కామేశ్వర్రావు అటు డబ్బు ఎంత సంపాదించాడో, ఇటు మంచీ సంపాదించుకున్నాడు.

డి.ఇ ఒ. కొడుకు అమెరికా నుంచి తిరిగివస్తున్నట్టు చిన్ననాటి స్నేహితు డైన విద్యాశాఖ డైరెక్టర్ రంగనాథ్ కామేశ్వర్రావుకు చెప్పడమూ, అయన చెప్పిన సంబంధమూ, తన భార్య చెప్పిన అరుంధతి కొడుకూ - ఒకడే అన్న విషయమూ కామేశ్వర్రావుగారు గుర్తించారు.

'అరుంధతి నాకు కొత్తదీ కాదు, దూరపు మనిషీ కాదు నేనూ, అదీ చిన్ననాటి స్నేహితులం. పక్కపక్క ఇళ్ళలో ఉండేవాళ్ళం! కాలేజీ చదువు లేకపోయినా అరుంధతికి చదువంటే ఇష్టం. స్వయంకృషిమీద బాగా చదువు కుంది. బంధువర్గం పెళ్ళిళ్ళలో చాలాసార్లు కలిశాం. వాళ్ళాయన లెక్చరర్గా

మొదలై ఇప్పుడు డి.ఇ.ఓ. చేస్తున్నాడు. కొడుకు అఖండమైన తెలివితేటలు ఉన్నవాడట. ఇంజనీరింగ్ ఇక్కడే చదివి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడట. ఇక అరుంధతి సంగతి. మడి, ఆచారం, పూజా పునస్కారం అన్నీ యథావిధిగా చేసే మనిషి. అంతా అత్తగారి ట్రెయినింగు. కట్నం ఎంత అడిగినా సరే, ఈ సంబంధం ఖాయం చేయడం మంచిది. మనూ అందరిలాంటి పిల్ల కాదు. సంప్రదాయం చూసి ఇస్తే దాని బ్రతుకు హాయిగా ఉంటుంది. దీని పూజలకూ, పునస్కారాలకూ, ఆ అరుంధతి మడికీ బాగా సరిపోతుంది.

ఇలా ఆవిడ చెబుతూ ఉంటే దూరంనుంచి తల్లి మాటలు వింటున్న మనోహరికి పెళ్ళికొడుకును చూడాలన్న ఆత్రతతో బాటు కాబోయే అత్తగారిని చూడాలన్న ఆత్రం పెరిగింది.

కానీ, అమెరికాలో ఉద్యోగం అని వినగానే సరస్వతి బ్రతుకే మళ్ళీమళ్ళీ గుర్తుకు వస్తూంది. దాని విషయమై మంజుతో ఒకమారు ప్రస్తావన వచ్చింది.

ఏదీ సీరియస్‌గా తీసుకోని మంజు దూకుడుగా మాటాడింది. "అం పిప్పళ్ళ బస్తాలా ఉంటుంది. అంత చదువుకుంది. ఆ మాత్రం ఒళ్ళు జాగ్రత్త పెట్టుకో నక్కర్లేదూ?" నేతిలోంచి ఈగను తీసేసినట్టు తీసేసింది. మంజు. "కట్నం చూసి చేసుకున్నాడు హీరో!"


"చేసుకున్నాడుగా? చూసే చేసుకున్నప్పుడు ఇప్పుడు ఒత్తరి అంటే ఎలా? చిన్నవాడు కాదుగా? డాక్టరుగిరీ చేస్తున్నాడు. తనకూ నలుగురు చెల్లెళ్ళు ఉన్నారు. అమెరికా వెళ్ళగానే పెళ్ళాం నచ్చకపోతే ఆ దెందులో దూకాలి?"

"పోనీలే, అక్కా. అందరూ ఒక్కలాగే ఉండరుగా! ఈయన తల్లి నీకు పెర్‌ఫెక్టయిన అత్తగారట. ఈయన చాలా మంచివాడేనేమో?"

"చూస్తూ సరస్వతి బ్రతుకులా...."

"దాని బతుకేక్కం? హాయిగా బాబా భజనలు చేసుకుంటూ, పిల్లలకు పాఠాలు చెప్పుకుంటుందిగా?"

"మంజూ! నీకు జీవితంలో హాస్యం పాలే ఎక్కువ కనబడుతుంది. ఎంత సులువుగా అనేశావ్! అంత చదువు చెప్పించి. అంత కట్నం ఇచ్చి, అంత ఖర్చు చేసి పెళ్ళిచేశారు. అంత గారంగా పెంచారు. భజన చేసుకుంటుదనేనా? వాళ్ళు ఎంత క్రుంగిపోతున్నారు! అదేమన్నా నీకు పట్టిందా? తనకు పెళ్ళి కాలే దని పాస్‌పోర్ట్‌లో వ్రాసుకున్నాడని తెలిసి వాళ్ళెంత బాధపడ్డారు? అంత పెద్ద డాక్టరు ఆ అమ్మాయి దృష్టిలో తను చేస్తున్న అమానుషం చూడగలిగాడా?




పెళ్ళంటే సరి అయిన అవగాహన ఉంటే ఇలా చేస్తాడా? ఇక సరస్వతి భజన కాక ఇంకేం చెయ్యగలదు? మరొకరిని చేసుకునే ధైర్యం దానికి వచ్చినా, అతగాడు దీన్ని బాగా చూస్తాడని నమ్మకమేమిటి? నిండు మనసుతో జీవితాన్ని ఆనందంగా గడపడానికి బదులు, పరిపక్వం కాని మనసుతో పరమాత్మను వెతకడానికి ప్రయత్నం చేస్తూంది...."

గొంతు పూడుకుపోయింది మనోహరికి.

* * * *

ముడిలో పూలు సవరించుకుంటూంది అరుంధతి, నిలువుటద్దం ముందు నించుని. బయట కారు ఆగిన ఇద్దరు పురంధ్రులు లోపలికి వచ్చారు.

పెర్ఫ్యూమ్ మెడమీద స్ప్రే చేసుకుంటున్న అరుంధతిని చూడగానే ఒకావిడ అడిగింది: "వదినగారు కోడలిని ఎంచుకోవడానికి బయలుదేరుతున్నారట?"

"కోడలి మాటకేం? అరుంధతిగారే ముద్దొస్తున్నారు." బుగ్గలు కొంచెం సడలినా, కెంపుల్లా ఎరుపెక్కడం మానలేదు అరుంధతికి.

"ఇంతకూ వచ్చిన విశేషం చెప్పారు కాదు మధుమతిగారు."

"ఏముంది? ఆ కలక్టరమ్మ వచ్చినప్పుడు అర్జెంటుగా తేల్చుకోవల్సినవి ఉన్నాయి - కొన్ని క్లబ్బుకోసం, కొన్ని మనకోసం. సూపర్ బజారులో మన

వాళ్ళకు నలుగురికైనా ఉద్యోగం వేయించే బాధ్యత మీమీద పెడుతున్నాం. పేర్లు ఏవైనా సరే-అవి మన వాళ్ళకు వచ్చేటట్టు చూడాలి నేను సెలెక్టు చేసిన పేర్లు ఇవి ఇందులో ఏ నలుగురికైనా సరే మీరు తలుచుకుంటే ఇదేమంత కష్టమైన పని కాదు"

"కాన్వెంటులో చదువుకున్న సుధ మీతో బాటు ఆవిడ దగ్గరికి వస్తానని మాట ఇచ్చింది మీరు బుకే ఇస్తే చాలు సుధ టపటపా మాటాడేస్తుంది."

"కారు వచ్చింది, అరుంధతీ!"

గది బయటినుంచే నారాయణమూర్తిగారు పిలిచారు భార్యను

లిస్టు డ్రెసింగ్ టేబిల్‌మీద పెట్టి, వచ్చిన మహిళ లిద్దరినీ పంపేసి, అద్దంలో మరొకసారి చూసుకొని బయలుదేరింది అరుంధతి

*　　　*　　　*　　　*

"ఆ అమ్మాయి ఎవరే!"

డ్రాయింగ్ రూమ్‌లోకి టిఫిన్ పట్టుకువెళ్ళిన గౌరి నడిగింది మంజూ.

"పెళ్ళికొడుకుగారి అక్కగారటమ్మా! ఆ నంటోడు ఆ యమ్మ బొట్టిడు గడ్గాయి ."

మంజూకు అక్కడికి వెళ్ళాలని ఉంది. కానీ, వాళ్ళమ్మగారు ససేమిరా పెళ్ళివారి ఎదుటపడవద్దన్నారట పెళ్ళి కొడుకు మనోహరిని కాదని, చిన్నదాన్ని చేసుకుంటానంటాడేమోనన్న పాతకాలం భయంతో కాదు.

మంజూ కోరేదానికి కారణం. ఇంద్రుడూ, చంద్రుడూ లక్ష్యంలేని మంజూ, తనకు నచ్చకపోతే ఎంతమాట నోటికివస్తే అంత మాటా అనేస్తుంది.

"పెళ్ళికొడుకు ఫరవాలేదు లేవే! జుట్టులో మొహం కనపడక పోయినా బాగానే వున్నాడు."

గౌరి ఏమీ అనకుండా ఊరుకొంది.

"ఆ అమ్మాయి పాంటు తొడుక్కుంటే ఎలా ఉంటుందే? ఏయ్, గౌరీ! విన్నే!"

"అరికేటమ్మా? మీ మాట్లు మరీని! మన బాయిలేరు మీద గోతం కప్పినట్టు "

"గుడ్! ఇంతకూ వాళ్ళ-అదే అమ్మ ఫ్రెండూ, ఆ అమ్మాయీ ఏమంటు న్నారు?"

"సినిమాల గోల ఇంగిలీసు ఇందీ "

"తెలుగు సిన్మాలు బొత్తిగా నీలాంటి వాళ్ళ కోసమే అఫ్‌కోర్స్! అది వాళ్ళ భావం ఆ అమ్మాయి ఏమంటూందే?"

"ఆ బొట్టిడిగొప్పలు పేంటా నేకపోతే బతకనేడక కోకాకోలా పోయి నాక తల్లిపాలు మాన్పించడమంత కష్టమై పోనాందట!"

"గౌరీ! నీకు అక్షరాలు నేర్పిస్తా-ఎంచక్కా నవలలు వ్రాసి పారేద్దువు గాని అదంతా వింటూ అమ్మ నోరు వెళ్ళబెట్టిందా-వాట్ ఎ థ్రిల్!" ఇక రచయిత్రి గౌరి మీడియం అక్కరలేకుండా తనే గోడవార నక్కి మాటలు వింటూంది మంజు

"ఆ పెర్‌ఫ్యూమ్ చాలా క్రూడ్‌గా ఉంది కదూ?" అడపడచు అమ్మాయి

"అదేమిటి, వదినా, చిన్ననాటి నుంచి ఎరిగి ఉన్నవాళ్ళం-నన్ను మన్నిస్తావెందుకు?"

"క్షమించండి! సంఘసేవలోకి వచ్చాక పదవక్లాసు అమ్మాయినైనా సరే, 'ఏమండీ' అనే సంస్కారాన్ని అలవాటు చేసుకున్నాను!"

ఈ సంభాషణ విన్న తరవాత కళ్ళు తిరిగినట్లయి లోపలికి వచ్చేసింది మంజు

"గౌరీ, గౌరీ! ఆ అమ్మాయి భర్త-ఎవరే ఆ అదృష్టవంతుడు?"

"పోలీసు జవాన్ల మీద పెద్ద "

ఓహ్! అదా విసురు? విస్కీతో పళ్ళు తోముకునే మనుషులకు ఏ పెర్‌ఫ్యూమ్ అయినా 'క్రూడ్' గానే ఉంటుంది ఆ పెద్దావిడ నిజంగా రచయిత్రి కావలసింది. కొంపదీసి ఏమోగూడా! ఆత్మీయత కంటె అలవరచుకున్న సంస్కారం గొప్పదనేస్తూంది ఇంతకూ అక్క-మాటలు వినపడ్డం లేదేం?"

"ఆ అమ్మాయిగోరు సిన్నమ్మగారితో ఏదో మాటాడాలంట - మేడ మీద కెళ్ళినా రిద్దరూ "

"అక్క ఎంత మారిపోయింది!"

విసురుగా తన గదిలోకి వెళ్ళి టేప్‌రికార్డర్ ఆన్‌చేసి, కిటికీలోంచి సముద్రం వంక చూస్తూ నించుంది మంజు

* * * *

రావు మనోహరి గదిలోకి వచ్చి చుట్టూ కలయ జూస్తూ నించున్నాడు అతని పరిశీలనకు మనోహరి అంతరాయం కలిగించకుండా కొంతసేపయ్యాక "కూర్చోండి" అంటూ కుర్చీ చూపించింది.

"ఈ బొమ్మలన్నీ ఎవరు వేశారు?"

"నేనే "

"మీరు మీరా భక్తులా?"

"మీరా పట్ల నాకు గౌరవం, భక్తీ రెండీ. కళలంటె నాకు ఇష్టం "

"మీ పేరు చాలా అందంగా ఉంది." ఇంగ్లీషులోనే రావు సంభాషణ కొనసాగిస్తున్నాడు.

"సంతోషం " తెలుగులో మాటాడుతూంది మనోహరి

"ఇంగ్లీషు సినిమాలు చూస్తారా?"

"నియమం లేదు కానీ, చూసినవి తక్కువ. నాకు బాగా అర్థం కావు "

"ఉచ్చారణా "

"అదొక్కటే కాదు "

"ఇంగ్లీషు ఎమ్ ఎ. పాసయ్యారు కదూ?"

"అభిరుచి కూడా ఉండాలి కదా?"

సంభాషణ మరి ముందుకు సాగలేదు.

"క్లబ్‌లో మీరంతా మెంబర్లటగా-మీకు డాన్స్ వచ్చా?"

"రాదు చూడడానికి నాకు అదోలా ఉంటుంది. మీరు స్టేట్స్‌వెళ్ళి ఎన్నాళ్ళయింది? ప్రశ్నార్థకం మీద తనకూ అధీనంఉందని తనకు అతనికీ గుర్తు చెయ్యాలనిపించింది మనోహరికి

"చాలా దురదృష్టకరం "

"అమెరికాలో ఉండటం మీకు ఇష్టంలేదా?" అళగా అడిగింది మనోహరి.

"మీకు డాన్స్ రాకపోవడం నేను వెళ్ళి మూడేళ్ళయింది?

"మీ వయస్సు?"

"ముప్పయి ఒకటి. నేను చాలా ఇష్టపడుతున్నాను-మీరు మాటాడే తీరు. మీరు ఎవరినైనా ప్రేమించారా? ఎవరితోనైనా "

"లేదు మీరు?"

"ఇద్దరమ్మాయిలతో చనువుగా రెండవ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకున్నాను. కానీ, అప్పటికే ఆమె తెలివితక్కువ పిల్ల!"

మనోహరికి అతని గతాన్ని కెలికి భరించడం కష్టమనిపించింది

"అమెరికాలో ఇలాగే ఉంటాయా పెళ్ళిచూపులు?"

ముందుగా ఎక్కడో కలుసుకుని మనం ఇప్పుడు మాటాడుకున్నట్టే మాటాడుకుంటారు ఇష్టపడిన తరవాత "

"ప్రశ్నలు వేసి పరీక్షించుకుంటారా?"

"అలా అని కాదనుకోండి అయినా, ఒకరి నొకరు అర్థంచేసుకుని "

"అంత సులువైనట్టు అంటే, వాళ్ళ వాళ్ళ పెళ్ళిళ్ళు పూర్తిగా వాళ్ళ బాధ్యత అన్నమాట. పెద్దవాళ్ళ జోక్యం "

"సిల్లీ! పెద్దలు ఇందులో జోక్యం చేసుకోవడం తెలివితక్కువతనం. మనోహరీ! ఐ లైక్ యూ! నాతోబాటు హాయిగా-స్వేచ్ఛగా— నీ బ్లడ్ గ్రూపు ఏమిటో "

"అమెరికాలో అదీ చూసుకుంటారా" మనోహరికి కోపం తెచ్చుకోవాలని ఉంది కానీ రావడంలేదు

రావు కుర్చీలోంచి లేచి ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు క్షణంలో తేరుకొని చేతులు విదిలించుకుంది

"మీ దగ్గర వర్జినిటీ సర్టిఫికెట్ ఉందా?" అని అడగాలనిపించింది. కానీ, మనోహరికి మగవాళ్ళకు అలాంటి పరీక్ష ఉన్నట్టు తెలియదు

ఒక త్రుటిలో కోపాన్ని దిగమింగుకొంది "టీ" అంది

"నాకు అర్థం కాలేదు"

"సంతోషం. "టీ" అంటె ట్రెడిషనల్ అదీ నా రక్తం గ్రూప్! మీరు మూడేళ్ళపాటున్న విదేశం ఊపిరినిచ్చి అంతవరకూ పెంచిన మాతృదేశం విలువను ఎంతగా తుంచేసింది!"

ఉప్పెనలా ఆవేశం మనోహరిలో పెల్లుబికింది.

"రావుగారూ! జీవన విధానంలో మార్పులు కాలధర్మానుసారాలు, సహజాలు కానీ, మీరు మన సంస్కృతిలోని వేళ్ళను సైతం పెకలించుకొని వెళ్ళి పోయినట్టున్నారు ఈ వయసులోని వేళ్ళు మరొక దగ్గర మనుగడ సాధించలేవు. క్షమించండి మీరు నన్ను చేసుకోవాలని అనుకోరనే నా నమ్మకం నా కున్న పురుష స్నేహితులు మీకు ఉండిన స్త్రీ స్నేహితురాళ్ళలాంటి వాళ్ళు లేరు. మిమ్మల్ని చేసుకోవడం నాకు ఇష్టం లేదు. నా పేరు మీకు నచ్చినందుకు సంతోషం! సెలవు!"

"ఇటాల్స్‌రైట్!" అనాలని రావు ప్రయత్నం చేశాడు. అపశబ్దాలు ఉచ్చరించినందుకు సంస్కృతం మాస్టారిచేత చెంపదెబ్బ తిన్న అబ్బాయి గొంతులా ఆతని గొంతు పూడుకుపోయి నోటమాట పెగలలేదు

* * * *

"అబ్బా! ఏమిటే నీ గోల?" అని అంటుందని ఊహించింది మంజు కాని, మనోహరి ఏదో ఆలోచనలో ఉండటం చూసి అడిగింది.

"అక్కా! ఎలా ఉంటాడే బావా?"

" "

"పాటలో లాగా లేడా, అక్కా? అదేమిటక్కా, నీ కంట్లో నీళ్ళు సారీ, అక్కా!" టేప్‌రికార్డర్ ఆపేసింది మంజు

"ఉండనీవే. అదేం చేసింది!" మళ్ళీ 'ఆన్' చేసింది. మనోహరి.

"ఎరుపెక్కె చెక్కిళ్ళు
ఎదలోన ఎక్కిళ్ళు
కోనేటి కాల్వైరి నీళ్ళు "

"ఏమయిందక్కా? అతను నిన్ను నచ్చుకోలేదని నొచ్చుకుంటున్నావా? పోనీలే, అక్కా! మా అక్కలాంటిపిల్ల దొరకడానికి అతడెంత అదృష్టవంతుడు కావాలి!"


"అది కాదే!"

"మరి కన్నీళ్ళెందుకు? ఆనందబాష్పాలా?" మంజు సహజ ధోరణికి వచ్చేసింది

"మనం ఎటు వెళుతున్నాం, మంజూ? నన్ను గదిలోకి తీసుకువెళ్ళి - డాన్సు వచ్చా, ఎవరినైనా ప్రేమించావా నీ బ్లడ్ గ్రూప్ ఏమిటి - ఇవీ ప్రశ్నలు ?"

"అరెరె! రుంబా తుంబా, రాక్ ఎన్ రోల్, ట్విస్ట్, ఛా ఛా ఛా అన్నీ వచ్చునని చెయ్యలేక పోయావా?"

"ఇప్పుడనేస్తే ఆ తరువాతో? సరస్వతి బ్రతుకు చూస్తున్నాంగా! మనం నాలుగు రాళ్ళు సంపాదించాలనో, కొంత విజ్ఞానం సంపాదించాలనో పైదేశం వెళ్ళి, విదేశీ వ్యామోహంలో పడి మన సంస్కృతిలోని వేళ్ళను ఊడబెరుక్కోవడం-దీనికి కారణం ఏమిటి? ఎంత విశ్లేషించినా "




"నే చెబుతా-వినక్కా- మన సంస్కృతి మన నరాల్లో లేకపోవడం; అనసూయ, అరుంధతీ ఎవరో మనకు తెలియని కాన్వెంటులో ఉండడం; కాన్వెంటులో చదివినా ఆంజనేయ దండకం మీద నమ్మకముంచుకున్నావు; అది అందరికీ లేకపోవడమే;"

"మంజూ! నువ్వు ఎంతగా ఎదిగిపోయావు; మరి, ఆ పాంట్లూ, ఆ బెల్‌బాటమ్‌లూ, ఆ జుట్టూ "

"పో, అక్కా; అది వేరు. నలుగురిలా ఉండాలిగా? అన్నీ సీరియస్‌గా తీసుకొంటావక్కా- మా సుందరి మేడమ్ రికార్డులో ఒక బిట్ ప్లేచేశా నంతే; పోయిన సంబంధం పోయింది -వాళ్ళ ఖర్మ; కాని, కన్నీళ్ళు పెట్టుకోకక్కా; అది తెలివితక్కువతనం; 'అబ్బాయి కళ్ళు గుచ్చే గులాబి ముళ్ళు' పాటతో ముగించింది మంజు

"గులాబి ముళ్ళు కాదు. అందమైన గులాబీకి ముళ్ళు అందంగానే ఉంటాయి ఇది కేవలం టేబిల్ గులాబి దీనికి ముళ్ళు ఉండవు; సువాసన ఉండదు కేవలం పేరుకే గులాబీ;"

మనోహరి తన గదిలోకి వెళ్ళిపోయింది;

—o—

Nov 10